# సింగిల్ పేజీ కథలు

# చిరుదీపం

చుట్టుముడుతున్న జ్ఞాపకాల దొంతర లను మోసుకుంటూ నడుస్తున్నాను. ఎప్పటికీ మరపురాని అనుభవాల దారాల వెంబడి నడుస్తు న్నాను. ఏటి ఒడ్డున తడి ఇసుకలో పాదముద్ర ల్లాంటి బాల్యాన్ని వెదుక్కుంటూ నడుస్తు న్నాను.

నా బాల్యపు ప్రతిబింబాల్ని సతీష్‌లో మళ్ళీ చూడాలని కలలుకంటూ నడుస్తున్నాను.

సతీష్..మా అక్క కొడుకు.

నేను ఉద్యోగం వేటలో ఊరు వదలకముందు రెండేళ్ళవాడు.

అప్పుడు నాకు వాడితోడిదే లోకం.

ముద్దులు మూటగట్టేటట్లున్న వాడిచేత ఎన్నెన్ని గేయాలు చెప్పించానని?

వచ్చీరాని మాటలును పేర్చుకుంటూ...పసి తనం నిండిన అమాయకపు నోటితో పలుకు తుంటే..అవి వినడానికి ఎంత ముద్దొస్తూ ఉంటాయో?

ఆలోచనలలోనే అక్కగారింటికి చేరుకున్నాను.

అప్పటికి పొద్దుగూట్లో పడుతోంది.

గుమ్మంలో అడుగుపెడుతూనే 'సడన్‌బ్రేక్' వేసినట్లుగా ఆగిపోయాను. లోపలి నుండి ఏవేవో కేకలూ, వాటిమధ్య సన్నని వెక్కిళ్ళతో కూడిన ఏడుపు వినిపిస్తున్నాయి.

ఎందుకో మనసు ఏదో తెలియని అశాంతికి గురయ్యింది.

పరీక్షగా వింటే ఆ కేకలు బావగారివని అర్థమ య్యింది.

మరి ఆ ఏడుపు?

కొద్దిసేపు తటపటాయించి లోనికి అడుగువే సాను.

లోపలి దృశ్యం చూడగానే ఒక్కసారి మనసు చివుక్కుమంది. ఎర్రగా కాల్చిన ఇనుపచువ్వతో వాతలు పెట్టినట్లయ్యింది. మెత్తని తోలుబెల్టుతో ఎడాపెడా బాదుతున్నట్లు అయ్యింది.

★ ★ ★

అక్క బావలు బలవంతం చేయటంతో ఆ పూట అక్కడే భోజనం చేసాను.

డాబాపై వెన్నెల్లో కుర్చీలు వేసుకున్నాం.

అక్క ఇంకా వంటిల్లు సర్దడంలోనూ, బావ ఏవో ఫైళ్లు చూడటంలోనూ క్రిందనే బిజీగా ఉన్నారు.

మూడు సంవత్సరాల క్రితం ఉద్యోగం వేటలో నా 'భాగ్యా'న్ని వెతుక్కుంటూ భాగ్యనగరం చేరు కున్నాను. అదృష్టవశాత్తూ ఒక కంపెనీలో చిన్న ఉద్యోగంలో చేరి అంకితభావంతో పనిచేస్తూ అంచె లంచెలుగా ఎదిగి ఒక స్థాయికి చేరు కున్నాను. 'స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్' జీ(వి)తం కోసం ఆరాటంలో ఇన్నాళ్లూ సొంత ఊరికి దూరంగానే ఉన్నాను. ఇప్పుడు కంపెనీ పనిమీద వైజాగ్ వస్తూ పనిలోపనిగా ఒకరోజు వీలు చేసుకొని ఈరోజు మా ఊళ్ళో అడుగుపెట్టాను మదిలో ఎన్నెన్నో మధురోహలను నింపుకుంటూ.

కానీ...

ఏ అనుభూతులను వెతుక్కుంటూ ఆశగా, ఆర్తిగా వచ్చానో? ఆ అనుభూతులు ఏవీ? ఎక్కడ?

నా ఆలోచనలను గజిబిజి చేస్తూ రెండు దృశ్యాలు నా మనసును కలవరపాటుకు గురిచేస్తు న్నాయి.

మొదటి దృశ్యం..'ఏనుగు ఏనుగు నల్లన..' వచ్చీరాని మాటలను పేర్చుకుంటూ ముద్దు ముద్దుగా పలుకుతున్న అమాయకమైన మోముతో సతీష్.

రెండవదృశ్యం- చెంపలపై చారికలు కట్టిన కన్నీటి ధారలతో, కాంతి విహీనమైన కళ్ళతో, ఎదర జీవితంలోని భారమంతా ఇప్పటినుండే నెత్తి కెత్తుకుంటున్నట్లు భారంగా కదులుతూ, తండ్రి వైపు భయం భయంగా చూస్తూ వెక్కుతున్న మోముతో సతీష్.

ఎందుకిలా జరుగుతోంది?

పాపం పుణ్యం ప్రపంచమార్గం తెలియని బాల్యం ఎందుకిలా చిత్రవధ పాలౌతోంది? మెట్ల దగ్గర చప్పుడు కావటంతో నెమ్మదిగా తలతిప్పి అటువైపు చూసాను.

అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చాడు సతీష్.

దుఃఖపు ఛాయలైతే మొహంలో లేవుకానీ కళ్ళకి ఇంకా ఏడుపు జీర ఉంది.

''రా సతీష్..బాగున్నావా?'' అంటూ వాడ్ని ఒళ్లో కూచోబెట్టుకున్నాను.

''మావయ్యా..నువ్విప్పుడు హైదరాబాదులో ఉంటున్నావా?'' కళ్ళు పెద్దవి చేస్తూ అడిగాడు.

''అవును. నీకు హైదరాబాదు గురించి తెలుసా?'' మాటలలో పెడుతూ అన్నాను.

''ఓ..అవి చాలా పెద్దదట కదా! మా టీచర్ చెప్పింది''

''అలాగా! ఇంకేమి చెప్పింది మీ టీచరు?''

''అక్కడ చార్మినార్ ఉందట కదా..ఇంకా..ఊ నువ్వు చెప్పంకుల్ అక్కడ ఏమేం ఉన్నాయో?'' గునుస్తూ అన్నాడు.

''మరి చెబితే నాకేం ఇస్తావ్? నీ దగ్గరున్న బొమ్మలన్నీ ఇచ్చేస్తావా?''

''నా దగ్గరస్సలు బొమ్మలే లేవుగా?'' ఆ నవ్వులో నిరాశ.

''అదేంటి? డాడీ నీకు బొమ్మలే కొనలేదా? నువ్వెప్పుడూ బొమ్మలతో ఆడుకోలేదా?'' మన సుని మథించడానికి అడిగిన ప్రశ్నలవి.

''...'' సమాధానమైతే చెప్పలేదుకానీ వాడి మొహం 'మబ్బులు కమ్మిన ఆకాశం' అయ్యింది.

''అది సరేకానీ..కాన్వెంట్ స్టూడెంట్‌వి కదా! మరి ఎలా చదువుతున్నావు?''

నా ప్రశ్న ఆ చిన్నారి మెదడులో ఎన్ని అగ్నిపర్వ తాలను పేల్చిందోగానీ- అంతవరకూ ఆ కళ్ళలో తారాడిన మెరుపు ఒక్కసారిగా అదృశ్యమైపో యింది. 'వెన్నెల కురిసే శశిబింబం' ఆ వెలిగే మొహం ఒక్కసారిగా 'గ్రహణం పట్టిన చంద్రుని'లా కళావిహీనమైపోయింది.

ఆ క్షణం ఆ పసిమనసు నా వైపు చూసిన చూపులు- 'నువ్వు కూడా నన్ను ఆ ఊబిలోకే లాగాలని చూస్తున్నావా? నీతో కబుర్లలో అన్నీ మరచిపోదామనుకున్నానే, ఈ కాస్త సంతోషం కూడా నాకు దక్కనీయవా?' అని ప్రశ్నిస్తున్న ట్లుగా ఉన్నాయి.

నా మనసు చివుక్కుమంది. వెంటనే తేరుకుని లాలనగా అన్నాను.

''నాకు తెలుసు సతీష్. నువ్వు చాలా చురుకైన వాడివని. క్లాసులో కూడా నువ్వెప్పుడూ మొదటి రేంకులోనే ఉంటావట కదా! మీ టీచర్ ఇందాక దారిలో కనిపించి చెప్పారులే. అన్నట్లు మీ టీచర్ నేను కాలేజీలో క్లాస్‌మేట్స్‌మి తెలుసా?'' చిన్న ట్రిక్ ప్లే చేసాను.

నా మాటలు ఆ చిన్నారి హృదయం మీద నిజంగానే పని చేసాయి. ఆ మొహంలోకి మళ్ళీ కళ వచ్చింది. కానీ అంతలోనే మళ్ళీ అపనమ్మకం. ఏదో బెరుకు.

''చెప్పు సతీష్! క్లాసులో ఏదన్నా ప్రోబ్లెమా? చెప్పాను కదా మీ టీచర్ మా క్లాస్‌మేట్ అని. నేను వెళ్ళి మాట్లాడతాను'' భరోసా ఇస్తున్నట్లుగా అన్నాను.

అంతే-

నా మాటల మలయమారుతం తాకిన ఆ గుండె మబ్బు కరిగి మాటల ప్రవాహమైంది.

''మావయ్యా! ఇంట్లోనేమో చదువూ

చదువూ అని నన్ను తిన్నగా తీసుకెళ్ళి ఆ ఇంగ్లీషు కాన్వెంట్‌లో వేసేసారు. అక్కడ వాళ్ళు చెప్పింది పూర్తిగా నాకు అర్థం కాదు. ఇంటి దగ్గర మమ్మీనడిగితే 'డాడీ వస్తారు అడుగు' అంటుంది. డాడీని అడిగితే- 'ఆఫీసు పనులతోనే తల పగిలిపోతుంది. ఏం స్కూల్లో అంతంత డబ్బు కట్టించుకుంటున్నారుకదా! ఆ మాత్రం చెప్పలేరా? వాళ్ళనే అడుగు చెబుతారు' అని విసుక్కుంటారు. పాఠం అప్పజెప్పకపోతే, హోంవర్కు చెయ్యలేకపోతే అక్కడ టీచర్స్ కొడతారు. ప్రోగ్రెస్ కార్డు చూసి ఇక్కడ డాడీ కొడతారు. ఇంకొన్నాళ్ళు చూసి మా ఫ్రెండ్ బాబీలాగే నేను కూడా కిరోసిన్ పోసుకుని అంటించుకుని చచ్చిపోతాను'' చెంపల మీదకి కన్నీరు కారుతుంటే వెక్కి వెక్కి ఏడవసాగేడు.

ఆ మాటలు ఆ పెనుగాలిలో చిగురాకులా వణికిపోయాను.

ఎంత అమానుషం! చీకూ చింతా లేకుండా హాయిగా గడపాల్సిన బాల్యం..బలవంతపు చావుగురించి ఆలోచిస్తుందంటే..సమాజమా నీ పయనం ఎటు?

అక్కాబావలు మేడమీదకి ఎప్పుడొచ్చారోకానీ సతీష్ మాటలు పూర్తయ్యేసరికి 'బాబూ' అంటూ సతీష్‌ని ఆర్తిగా అక్కున చేర్చుకున్నారు.

బావగారి కళ్ళు నీటి చెలమలే అయ్యాయి.

అక్క సంగతి చెప్పనే అక్కరలేదు.

ఏ బాల్య స్మృతులనైతే తిరగరాసుకుందామని వచ్చానో ఆ బాల్యమే ఇక్కడ 'కొలిమి సమ్మెట దెబ్బ'లకు గురిఔతుంటే-

ఏ గతాన్ని తలుచుకుని మురిసిపోవాలని కలలు కంటూ వచ్చానో ఆ గతమే ఇప్పుడు 'మండుటెండలో మంచుబిందువులా' ఆవిరైపోతుంటే-

నా గుండె చెరువయ్యింది.

నో..అలా జరక్కూడదు.

నేటి బాల్యం..ఇలా..'ఒత్తిడి చక్రాల' క్రింద పడి నలిగిపోకూడదు.

'చిన్నారిదీపం' లోకంలోని చీకట్లనంతటినీ పారద్రోలలేకపోయినా తన పరిధిలో తాను 'వెలుగు' నింపుతుంది. చీకట్లను చీలుస్తూ వెలుగులోకి పయనించాలనుకునేవారికి మార్గదర్శకమౌతుంది.

'నేను కూడా ఏదో ఒకటి చేయాలి?'

'ఏం చేయాలి?'

నా దృష్టిలో బాలలు ఆకాశంలో విహంగాల్లా స్వేచ్ఛగా ఎగరాలి. తోటలో విరిసిన పుష్పాలవికల్లా సహజ పరిమళాలు వెదజల్లాలి.

ఊళ్లో నాతోపాటు చదువుకున్న నా స్నేహితులు కొందరు ఇంకా ఖాళీగా ఉన్నారు. వాళ్ళను కూడగట్టాలి.

నా ఊహలలో 'మరో శాంతి నికేతన్' రూపుదిద్దుకుంటోంది.

**-పి.వి.రమణ** (నర్సీపట్నం)

# శ్రీరంగనీతులు

**డాబాపై బట్టలు ఆరేస్తూ క్రిందికి చూసిన సరితకు, తన ఇంటిముందున్న రావిచెట్టుక్రింద ఎవరో కుర్రాడు నిలబడి తమ ఇంటివైపు అదేపనిగా చూడటం గమనించింది. వెంటనే గబ గబా క్రింది దిగి వచ్చి-**

''ఏవండీ.. ఏవండీ'' గట్టిగా కేకలేస్తూ పేపరు చదువుతున్న భర్త దగ్గరకు వచ్చింది.

''ఏమిటే'' పేపర్లో నుండి తలపైకెత్తకుండానే అన్నాడు రంగారావు.

''ఏవండీ! ఎవరో పోకిరీ వెధవ, మనింటి ముందున్న రావిచెట్టుక్రింద, నిలబడి మన ఇంటివైపే చూస్తున్నాడండీ''

''ఏదో పనుండి నిలబడి వుంటాడులే'' విసుగ్గా అన్నాడు.

''కాదండీ అతను చాలా సేపటినుండి నిలబడి వుండటం నేను గమనించాను'' అంది.

''నీకు అన్నీ అనుమానాలే. కాసేపు నిలబడి, కాళ్ళు నొప్పిపుడితే వాడే వెళ్ళిపోతాడులే'' పట్టించుకోకుండా అన్నాడు.

''ఇంట్లో ఈడొచ్చిన ఆడపిల్ల వుందనే సంగతే పట్టించుకోరేం? మొన్నటికి మొన్న మన సంధ్య కాలేజీ నుండి వస్తుంటే, ఎవరో పోకిరీ వెధవలు, వెకిలి పాటలు పాడుతూ, దీన్ని అల్లరి చేశారట. అది ఏడుస్తూ వచ్చి నాతో చెప్పింది. బహుశా వీడు ఆ గ్యాంగ్‌లోని వాడే అయ్యుంటాడు. వెళ్ళి నాలుగు దులిపేసి రండి'' కోపంగా అంది.

భార్య చెప్పింది నిజమో కాదో అని బాల్కనీలోకి వెళ్ళి చూశాడు రంగారావు. నిజంగానే ఎవరో నూనూగు మీసాల కుర్రాడు నిలబడి తమ ఇంటివైపే దృష్టిసారిస్తున్నాడు. అతని ముఖంలో విసుగు, కోపం స్పష్టంగా తెలుస్తున్నాయి.

''రాస్కెల్స్ అమ్మాయిలు కనిపిస్తే చాలు షర్టులో ఐసుగడ్డలు వేసినట్టు తెగ మెలికలు తిరిగిపోతుంటారు. అదే, అమ్మాయిలు ఛీ కొడితే ప్రేమ భగ్నమైన సినిమాలో హీరోలా ఫీలయిపోతుంటారు. వెళ్ళి ఎడాపెడా వాయించి రండి'' కోపంగా అంది. వెంటనే క్రిందికి దిగి ఆ కుర్రాడి దగ్గరకు వెళ్ళాడు రంగారావు.

''ఏం బాబు, పనీ పాటా ఏమీ లేదా? తీరిగ్గా నిలబడి ఎవరికి సైటు కొడుతున్నావు? ఈడొచ్చిన అమ్మాయిలను చూస్తే దురద పెడుతుందా ఒళ్ళు'' కోపంగా అన్నాడు రంగారావు. ఆ కుర్రాడు అర్థం కానట్టు చూశాడు.

''ఏమంటున్నారు మీరు?'' అర్థంకాక అడిగాడు.

''ఏంటి గంటసేపటి నుండి నిలబడి మా ఇంటివైపే చూస్తూ, ఏమి తెలియని వాడిలా నటిస్తున్నావు''

''సార్ మీరు తప్పుగా అర్థం చేసుకున్నారు. నేను చూస్తున్నది మీ ప్రక్క పోర్షన్ లోకి..''

'పోరి భడవా' అని రంగారావు మనసులో అనుకుంటూ ''ఆ పక్క పోర్షన్ వంక చూస్తున్నావా? ఆ పోర్షన్లో ఓ యంగ్ విడో వుంటుంది అందంగా, ఒంటరిగా వుంటుందని తెలిసి ఆవిడకు సైటు కొట్టడానికి వచ్చావా? బుద్ధుందా నీకు? చదువుకుంటేనే సరికాదయ్యా, కాస్త సభ్యత-సంస్కారం, మంచి-మర్యాద తెలిసి వుండాలి. నిన్ను కన్న తల్లిదండ్రులు, నిన్ను కష్టపడి పెంచి, పోషించి చదివిస్తుంటే, నువ్వు ఇక్కడ అడ్డమైన వెధవ్వేషాలు వేస్తున్నావు. అక్కడ నీ తండ్రి..''

''ఆపుతారా'' ఏదో చెప్పబోయిన రంగారావు తక్కున ఆపేశాడు. పది నిముషాల నుండి అదే పనిగా నీతులు వల్లిస్తుండటంతో విని విసిగిపోయిన ఆ కుర్రాడు..

''మీరు వల్లించిన ఈ నీతులు, మీ ప్రక్క పోర్షన్‌లోకి వెళ్ళి గంటసేపయినా రాని మా నాన్నకి చెప్పండి. కొంచెమైనా బుద్ధివస్తుందేమో? నేను గంట సేపటి నుండి చూస్తున్నది మా నాన్నకోసం'' విసురుగా అనేసి వెళ్ళిపోయాడు ఆ కుర్రాడు.

గతుక్కుమన్నాడు రంగారావు. 'మా ప్రక్క పోర్షన్‌లోకి దూరిన ఈ కొత్త శాల్తీ ఎవరు? నాకు పోటీగా తయారయ్యేట్టు వున్నాడే' అనుకుంటూ-

'అవును ఇప్పుడు వల్లించిన నీతులన్నీ నాకు వర్తిస్తాయేమో' అనుకొని తేలుకుట్టిన దొంగలా మెల్లగా జారుకున్నాడు రంగారావు.

**-ఎస్.కె. సన్నీ** (శ్రీకాళహస్తి)